


# కరపత్రం

SINCE 2014

శనివారం మే 16, 2026 | సంపుటి : 2 | సంచిక : 214 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

## రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా

- ఆ తరవాత జాతీయ రాజకీయాల్లోకి వెళతా
- రాహుల్ తరవాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా
- సిఎం రేవంత్ రెడ్డి మరోమార్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,మే15 :
తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ఆత్మహత్యలు కావు..వ్యవస్థలు చేసిన హత్యలు

- నీట్ విద్యార్థుల ఆత్మహత్యపై రాహుల్ ఆందోళన
- ప్రభుత్వం ఎప్పుడు కళ్లు తెరుస్తుందని ప్రశ్న

న్యూఢిల్లీ,మే15 :
నీట్ పరీక్షల రద్దుతో ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులవి వ్యవస్థలు చేసిన హత్యలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నీట్ పరీక్షలకు సంబంధించిన ఆత్మహత్య ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కుంభకోణాలు, అవినీతి కారణంగా విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని ఆరోపించారు. సోషల్ మీడియా వేదికగా రాహుల్ గాంధీ పోస్టు పెట్టారు. లఖింపూర్ ఖేరీకి



2 లో

చెందిన 22 ఏళ్ల హృతిక్ మిశ్రా చివరిసారిగా 'నేను ఇకపై పోటీ పరీక్షలు రాయను' అని చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. మూడోసారి నీట్ పరీక్ష రాస్తున్న హృతిక్, పరీక్ష రద్దు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. అలాగే ఉనీజీలో కూడా నీట్ పరీక్ష రాసిన మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తుచేశారు. ఈ ఘటనలు కేవలం ఆత్మహత్యలు కావని, అవినీతి వ్యవస్థ చేసిన హత్యలని రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పరీక్ష చేతిలో విద్యార్థులు ఓడిపోలేదు..

# జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ
- దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం అని వెల్లడి




మిగతాది 2లో



# పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారం

» సిటీసివిల్ కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

హైదరాబాద్,మే15 :
కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్‌లో పరువు నష్టం కలిగించేలా వార్తలు ప్రసారం చేస్తున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

2 లో

# తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

» సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు
» రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు పిసిసి వినతి



2లో..

హైదరాబాద్,మే15 :
ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృదం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి.

# ఎన్నికలు కాగానే పెటరో ధరలు పెంచారు

- మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం
- మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ



02

హైదరాబాద్,మే15 :
ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మరోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు.

# పెట్రో ధరల పెంపు అనివార్యం

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లవి పనీపాటలేని విమర్శలు
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



2లో..

హైదరాబాద్,మే15 :
పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు.

# మియాపూర్‌లో సీఏ విద్యార్థి అనుమానాస్పద మృతి

హైదరాబాద్:



మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో సీఏ విద్యార్థి కుమ్మరి జనార్ధన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన గదిలో ఉరికి వేలాడుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గదిలో రక్తపు మరకలు ఉండటంతో జనార్ధన్ మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ

హైదరాబాద్:
తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి కె.కేశవరావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కోదండరాం, అద్దంకి దయాకర్, రాములు నాయక్, శోభన్ రెడ్డిలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఉద్యమకారులను గుర్తించి, వారిని గౌరవించడానికి సూచనలు చేయనుంది.




2లో..

# హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

- రైల్వేశాఖతో కలసి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు



హైదరాబాద్,మే15 :
హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047

2లో..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం మే 16, 2026

## పెట్రో ధరల పెంపు అనివార్యం

మొదటిపేజీ తరువాయి
దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.జేసీబీ యాజమాన్యానికి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్లమెంట్ సభ్యులు నిరంతరం కేంద్రం నుంచి నిధులు తెస్తున్నారని ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు తెలిపారు. ప్రధాని, సీఎం.. ప్రతినెల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొంటూ ప్రత్యేక దృష్టి పెడుతున్నారన్నారు. గతంలో చెత్తా చెదారంగా ఉన్న ఈ ప్రాంతాన్ని టీడీపీ ప్రభుత్వం.. చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా మారుస్తోందని అన్నారు. విజయవాడ నగర అభివృద్ధి ఎంపీ కేశినేని శివనాథ్ కృషికి నిదర్శనమన్నారు. రూ.23 కోట్ల నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. అధికారం అలంకారం కాదని.. ఒక బాధ్యత అని బోండా ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు.

## తెలంగాణలో ఇప్పట్లో ఎన్నికలు లేవు

మొదటిపేజీ తరువాయి
తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3–4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## ఎన్నికలు కాగానే పెటరో ధరలు పెంచారు

మొదటిపేజీ తరువాయి
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## పరువు నష్టం కలిగించేలా వార్తల ప్రసారం

మొదటిపేజీ తరువాయి
తన కుమారుడు భగీరథ్ పోక్సో కేసుతో పాటు తనపైన దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో తన పేరు, ఫొటోలు, వీడియోలు వాడొద్దంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన పేరుతో ఇప్పటివరకు సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానళ్లలో ఉన్న వీడియోలను తొలగించాలని కోర్టును బండి సంజయ్ కోరారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రచారం జరుగుతోందని న్యాయస్థానానికి బండి సంజయ్ వివరించారు. ఈ క్రమంలో సోషల్ మీడియా, యూట్యూబ్, మీడియాలో బండి సంజయ్‌పై వచ్చిన కథనాలను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాల వరకు ఎలాంటి కథనాలు ప్రసారం చేయొద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. యూట్యూబ్, సోషల్ మీడియాలో బండి సంజయ్‌కి వ్యతిరేకంగా ఉన్న పోస్టులను వెంటనే తొలగించాలని సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది.

## ఆత్మహత్యలు కావు..వ్యవస్థలు చేసిన హత్యలు

మొదటిపేజీ తరువాయి
అవినీతి వ్యవస్థ చేతిలో బలయ్యారని అన్నారు. 2015 నుంచి 2026 వరకు దేశవ్యాప్తంగా 148 పరీక్షల కుంభకోణాలు వెలుగుచూశాయని ఆయన ఆరోపించారు. వాటిలో 87 పరీక్షలు రద్దయ్యాయని, దాదాపు 9 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభావితమైందని పేర్కొన్నారు. ఈ 148 కుంభకోణాల్లో కేవలం ఒక్కరికే శిక్ష పడిందని, సీబీఐ 17 కేసులు, ఈడీ 11 కేసులు నమోదు చేసినప్పటికీ ఎవరూ బాధ్యత వహించలేదని విమర్శించారు. ప్రత్యేకంగా నీట్, ఏఐపీఎంటీ మరియు ఇతర వైద్య ప్రవేశ పరీక్షల్లోనే 15 కుంభకోణాలు జరిగాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన అధికారులు, మంత్రులు రాజీనామా చేయకపోవడం అత్యంత సిగ్గుచేటని అన్నారు. కొందరిని తొలగించినట్లు చూపించి, తిరిగి ఉన్నత పదవుల్లో నియమిస్తున్నారని ఆరోపించారు. మోసానికి సహకరించే వారికి బహుమతులు లభిస్తుండగా, పరీక్షలు రాసే పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారు అంటూ కేంద్ర ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీని ఉద్దేశించి, మీలో జవాబుదారీతనం మేల్కొనడానికి ఇంకా ఎంతమంది హృతిక్‌లు కావాలని ప్రశ్నించారు. విద్యార్థుల బాధ తన బాధ అని, వారి భవిష్యత్తును దోచుకున్న వారు తప్పకుండా సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఎంత కాలం పట్టినా సరే, ఎవరినీ వదిలిపెట్టం. ఈ యుద్ధాన్ని మనం కలిసి పోరాడదాం.. మనం గెలుస్తాం అంటూ ధైర్యాన్ని ఇచ్చారు.

## హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులు

మొదటిపేజీ తరువాయి
ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు. హైదరాబాద్, పూనే,ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ –బెంగళూరు కారిడార్, హైదరాబాద్– చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఊఓఆం మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

# పొదుపు చర్యల్లో టిడిపి మరో అడుగు

## మహానాడును వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయం

**నెల్లూరు వేదికగా నిర్వహించాలనుకున్న మహానాడు రద్దు**
**మంగళగిరి పార్టీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు**
**వర్చువల్గా జిల్లా పార్టీ కార్యాలయాలద్వారా ప్రసారం**

పొదుపు చర్యల్లో భాగంగా తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మహానాడును ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో వేదిక ఏర్పాటు చేసి నిర్వహించాలని పార్టీ నేతలకు సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించాలని తొలుత నిర్ణయించి ఏర్పాట్లు ప్రారంభించారు. పొదుపు చర్యల్లో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 27, 28న మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై పార్టీ హై కమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించాలని భావించిన మహానాడును ఇప్పుడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మహానాడు కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. భారీ జన సమీకరణకు బదులుగా సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను అనుసంధానించే విధంగా ఈసారి మహానాడును నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ చరిత్రలో హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహణకు తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. పార్టీ కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ, సమర్థవంతమైన నిర్వహణకు ఈ విధానం ఉపయోగపడుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు.

పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో నేతలు ప్రత్యక్షంగా పాల్గొనగా, జిల్లాలు, నియోజకవర్గాలు, క్లస్టర్ల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వర్చువల్ విధానంలో హాజరుకానున్నారు. మంగళగిరిలో జరిగే మహానాడుకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రత్యక్షంగా హాజరవుతారు. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, ముఖ్య నాయకులు తమ తమ నియోజకవర్గాల నుంచి ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీకి చెందిన 1848 క్లస్టర్ల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కూడా ఆయా క్లస్టర్ల నుంచే వర్చువల్‌గా మహానాడులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఒకేసారి మహానాడును వీక్షించేలా సాంకేతిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మహానాడులో ప్రవేశపెట్టే రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాలు సహా అన్ని కార్యక్రమాలు సంప్రదాయ మహానాడు తరహాలోనే నిర్వహించనున్నట్లు టీడీపీ నేతలు వెల్లడించారు. తీర్మానాల ఆమోదం, నాయకుల ప్రసంగాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు అన్నీ హైబ్రిడ్ మోడల్‌లో కొనసాగనున్నాయి. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ విధానాలపై చర్చ, భవిష్యత్తు రాజకీయ వ్యూహాల రూపకల్పన వంటి అంశాలు ఈ మహానాడులో ప్రధాన అజెండాగా ఉండనున్నాయి.

# ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలం

**ఒంటరి పోరాటం చేసి దెబ్బతిన్న విషయం మరవద్దు**
**పార్టీ శ్రేణులతో జనసేనాని పవన్ కళ్యాణ్**
**పార్టీ సభ్యత్వం అంటే జనసేన ఆశయాలకు అద్దం**
**ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాల లక్ష్యం**
**పార్టీ కార్యకర్తల స్వేదం మరచిపోలేనిది**
**పార్టీ పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్**

ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటేనే పార్టీని నడపగలమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పక్క రాష్ట్రంలో ఒకరు పార్టీ పెట్టి సీఎం అయ్యారని, తాను కూడా అలా వెళ్తే బాగుండేదని అనేక మంది సలహాలు ఇస్తున్నారని.. కానీ ఏపీలో పరిస్థితులు వేరనే విషయాన్ని వాళ్లు తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో 'జనసేన ఉద్యమ ఆత్మీయ సమావేశం' నిర్వహించారు. ఈ సమావేశానికి పవన్ హాజరై మాట్లాడారు. ఒంటరిగా వెళ్లి దెబ్బతిన్నాం.. నేనూ రెండు చోట్లా ఓడిపోయా. జనసేన పార్టీకి మూలస్తంభం కార్యకర్తలే. కుటుంబం నడిపే పార్టీగా ఉండకూడదని కోరుకుంటున్నానని పవన్ అన్నారు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు సీఎం విజయ్‌తో పోల్చి తనను వైసీపీ నేతలు విమర్శలు చేయడంపై పవన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దశాబ్దం కాలం పాటు నలిగిపోయి, ఫ్యాక్షన్ రాజకీయాలు తట్టుకుని ఇక్కడి వరకు వచ్చామని వ్యాఖ్యానించారు. ఈ మధ్యన పక్క రాష్ట్రంలో ఒక వ్యక్తి పార్టీ పెట్టి సీఎం అవగానే తనతో పోలిక పెట్టారని తెలిపారు. ఊర్లో పెళ్లికి ఏదో హడావుడి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మన ఊర్లో పెళ్లి జరుగుతుంటే. చిన్నపిల్లలు పరుగులు పెడుతుంటారని.. అలా ఉంది వారి ప్రచారమని ఎద్దేవా చేశారు. ఏపీలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరని.. అక్కడి పరిస్థితులు వేరని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 2019లో తాను పోటీ చేస్తే రెండు చోట్లా ఓడించారని.. దీంతో తనతో ఉన్న నాయకులు వెళ్లిపోయారని ప్రస్తావించారు. పొంతన లేని పోలికలు పెట్టి.. ప్రచారం చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. కమ్యూనిస్టులు పార్టీ పెట్టి ఎన్నో దెబ్బలు తిని నిలబడ్డారని ప్రస్తావించారు. అదేవిధంగా ఒక రాజకీయ పార్టీ నడపడం అంటే అంత ఈజీ కాదని తెలిపారు. 2007 నుంచి 2018 వరకు దశాబ్దం పాటు తాను ఇబ్బంది పడ్డానని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. దెబ్బతినకుండా ఏదీ రాదని.. 2024కి అధికారంలో భాగస్వామ్యం అయ్యామని తెలిపారు. ఈరోజున అందరూ తనను వదిలేసినా.. తాను పార్టీని ముందుకు తీసుకెళ్తున్నానని స్పష్టం చేశారు. కార్యకర్తల నుంచి బలమైన నాయకత్వం తనకు రావాలని కోరుతున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కేవలం ఒక సంఖ్య కాదని, అది పార్టీ విలువలను, అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఒక గొప్ప యజ్ఞమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అమరావతిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొని, జనసైనికులను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు కార్యకర్తలు పడుతున్న కష్టాన్ని, పార్టీ ఇస్తున్న భరోసాను ఆయన వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదుపై నాదెండ్ల మనోహర్ కీలక గణాంకాలను వెల్లడించారు. 2024 ఎన్నికల తర్వాత జనసైనికులు ఎంతో బలంగా నిలబడి 12 లక్షల 12 వేల సభ్యత్వాలు చేశారని గుర్తు చేశారు. ఈ ఏడాది పార్టీ 25 లక్షల సభ్యత్వాలను లక్ష్యంగా పెట్టుకోగా, క్షేత్రస్థాయిలో జనసైనికుల కృషి వల్ల ఇప్పటికే 21 లక్షల 50 వేల సభ్యత్వాలు పూర్తి కావడం విశేషమని ఆయన కొనియాడారు. ఏటా సభ్యత్వాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటం పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని చెప్పారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు జనసేన ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మనోహర్ భరోసా ఇచ్చారు. 2020లో సభ్యత్వ నమోదు ప్రారంభించినప్పటి నుండి దురదృష్టవశాత్తూ 1,034 మంది జనసైనికులు ప్రాణాలు కోల్పోయారు. పార్టీ సభ్యత్వం ఉండి మరణించిన వారందరికీ కలిపి ఇప్పటి వరకు రూ. 46 కోట్ల 35 లక్షలను చెక్కుల రూపంలో వారి కుటుంబాలకు అందజేశాం అని ఆయన వివరించారు. రాజకీయాల్లో కష్టాలు, సమస్యలు సహజమని, కానీ జనసేన ఎప్పుడూ తన సిద్ధాంతాలకు కట్టుబడే ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. పార్టీలో వర్గాలు లేదా భిన్న నాయకత్వాలు ఉన్నాయని వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. జనసేనలో ఎలాంటి వర్గాలు లేవు. మనందరికీ ఉన్నది పవన్ కళ్యాణ్ నాయకత్వం ఒక్కటే. నిజాలు తెలుసుకోకుండా

ఎవరూ తొందరపడి మాట్లాడవద్దని సూచించారు. పార్టీ కోసం వీరమహిళలు, జనసైనికులు ఎంతో ధైర్యంగా నిలబడ్డారని, వారి కష్టానికి తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసైనికులు ఒక అవకాశంగా తీసుకోవాలని నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం మన ముందు ఉందని, పవన్ కళ్యాణ్ గారి ఆశయాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడమే మన లక్ష్యం కావాలని కోరారు. ఏ రోజూ స్వార్థం కోసం పని చేయని జనసైనికుల కృషితో పార్టీ మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

**రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్**
**ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది**
**జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి**
**అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన**
**దేశ అభివృద్ధిలో ఇక ఎపి కీలక భూమి అన్న చంద్రబాబు**

దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు.రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు.

# కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సలీం పాషాకు ఘన నివాళులు

▪ కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ సర్పంచ్ పొనగంటి మల్లయ్య



**జమ్మికుంట, మే 15 కరపత్రం ప్రతినిధి**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ సలీం పాషా ఇటీవల మరణించడంతో ఆయనకు జమ్మికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పొనగంటి మల్లయ్య ఘన నివాళులు అర్పించారు. అనంతరం సలీం పాషా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పొనగంటి మల్లయ్య మాట్లాడుతూ సలీం పాషా కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలందించిన నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తూ సామాజిక సేవలో ముందుండేవారని గుర్తుచేశారు. ఆయన మరణం పార్టీకి, స్థానిక ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్, ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ రామకృష్ణ, జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాతకాల ప్రవీణ్, కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని సలీం పాషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# భీమేశ్వరాలయంలో బాలల హక్కుల కమిషన్ బృందం ప్రత్యేక పూజలు

**కరపత్రం ప్రతినిధి, వేములవాడ**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డితో పాటు కమిషన్ సభ్యులు మర్రిపల్లి చందన, వందన గౌడ్, బండి అపర్ణ, వచన్ కుమార్ రెడ్డి, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న కమిషన్ ప్రతినిధులకు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తి స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డీఈఓ భాస్కర్ శర్మ కమిషన్ సభ్యులకు లడ్డూ ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ గోవిందుల అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస శర్మ, వి. వెంకట ప్రసాద్ రాజు (గుట్ట రాజు), ఆలయ ఉద్యోగులు, వేద పండితులు పాల్గొన్నారు.

# పెన్షన్ లైవ్ అథెంటికేషన్ కార్యక్రమం ప్రారంభం

▪ లబ్ధిదారులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి : మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి

**జమ్మికుంట, మే 15 కరపత్రం ప్రతినిధి**




తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ లైవ్ అథెంటికేషన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు మొత్తం 30 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వృద్ధాప్య పింఛన్, వికలాంగుల పెన్షన్, వితంతు పెన్షన్, చేనేత కార్మికుల పెన్షన్, కల్లుగీత కార్మికుల పెన్షన్, ఒంటరి మహిళల పెన్షన్ తదితర సామాజిక భద్రతా పింఛన్ల లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ లైవ్ అథెంటికేషన్ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.

లబ్ధిదారులు తమ ఆధార్ కార్డుతో పాటు సంబంధిత వార్డు అధికారులను సంప్రదించాలని, వార్డ్ ఆఫీసర్లు తమ మొబైల్ ఫోన్ ద్వారా ఫేస్ అథెంటికేషన్ పద్ధతిలో లైవ్ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ప్రతి వార్డులో అందుబాటులో ఉన్న వార్డ్ ఆఫీసర్లు ప్రత్యేకంగా ఈ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు.

అలాగే ప్రతి వార్డులో నిర్ణయించిన ప్రదేశాలకు లబ్ధిదారులు హాజరై సర్వే మరియు అథెంటికేషన్ పూర్తి చేయించుకోవాలని కోరారు. భవిష్యత్తులో పెన్షన్ల పంపిణీలో ఎలాంటి అంతరాయాలు లేకుండా, అర్హులైన వారికి సక్రమంగా పింఛన్లు అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని కమిషనర్ తెలిపారు.

కాబట్టి అన్ని రకాల పెన్షన్ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గడువులోపు లైవ్ అథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉన్నావ్ దోషి కుల్దీప్ సింగ్‌కు ఎదురుదెబ్బ

– ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు రద్దు చేసిన సుప్రీం
– మరోమారు పూర్తి విచారణ జరపాలని ఆదేశం

ఉన్నావ్ అత్యాచారం కేసులో జీవితఖైదు పడిన భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సెంగర్ జైలు శిక్షను నిలిపివేస్తూ గతంలో దిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను.. తాజాగా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై మరోసారి విచారణ జరపాలని హైకోర్టును సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. దిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా తనను దోషిగా తేల్చడం, యావజ్జీవ కారాగార శిక్ష విధించడంపై సెంగర్ వేసిన అప్పీల్‌ను రెండు నెలల్లోగా పరిష్కరించాలని హైకోర్టును ఆదేశించింది. ఒకవేళ దోషిగా తేల్చడంపై నిర్ణయం తీసుకోలేకపోతే.. యావజ్జీవ శిక్షను నిలిపివేయాలని కోరుతూ అతడు దాఖలు చేసిన పిటిషన్‌పైనైనా ఉత్తర్వులు ఇవ్వాలని తెలిపింది. ఈ కేసు అర్హతలపై తాము ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయడం లేదని, హైకోర్టు కొత్తగా విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఒక ఎమ్మెల్యేను ప్రభుత్వ ఉద్యోగిగా పరిగణించవచ్చా,

# రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

– ఈ నెల 30న కరీంనగర్ లో రైతు మహాగర్జన
– రైతు సంఘాల ఐకాస జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్:**

రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, అన్నధాతలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించక తప్పదని, ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై పోరాటమే లక్ష్యంగా ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ డిమాండ్ల సాధనకు రైతు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 30 న కరీంనగర్ వేదికగా భారీ ఎత్తున నిర్వహించే రైతు మహాగర్జన సమరభేరి సభకు మద్దతు కోరుతూ శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ నాయకుల తో మండల కేంద్రంలో సమావేశం జరిపి మహాగర్జనకు సభకు ఆహ్వానిస్తూ పోలాడి రామారావు నాయకుల తో కలిసి ఆహ్వాన పత్రికలను అందజేయగా అందుకు వారు సానుకూలంగా స్పందించి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించి రామారావు తో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం పోలాడి రామారావు, తాళ్ళ పల్లి శేఖర్ గౌడ్ లు మాట్లాడుతూ రాష్ట్రం లో వరి, మొక్కజొన్న కొనుగోళ్లు నత్త నడకన



సాగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ. 500బోనస్ చెల్లింపులో అనేక కొర్రీలు పెడుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలలో అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో మిల్లర్లు,కింది స్థాయి సిబ్బంది కుమ్మక్కై తేమ, తాలు పేరుతో క్వింటాల్ కు ఆరు కిలోల నుండి 8 కిలోల వరకు కోత విధిస్తూ రైతులను నిలువుగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఏ గ్రేడ్ దాన్యాన్ని కామన్ గ్రేడ్ క్రింద జమ కడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులు దాన్యాన్ని ఎండ బెట్టే క్రమంలో తీవ్రమైన ఎండల తో రైతులు మృత్యువాత పడటం కలచివేసిందన్నారు.పెట్టు బడి సాయం క్రింద అందించాల్సిన రైతు భరోసా నిధుల విడుదలలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని పోలాడి రామారావు ధ్వజమెత్తారు. యాసంగి సీజన్ ముగిసినా నేటికీ రైతుల ఖాతాలో పూర్తిగా నిధులు జమ కాకపోవడం ప్రభుత్వ చిత్త శుద్ధికి నిదర్శనమన్నారు.

కొనుగోలు కేంద్రాలలో లారీలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. అన్ని పంటలకు బోనస్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకతీతంగా రైతాంగ సమస్యలపై పోరాటమే లక్ష్యంగా ఈ నెల 30 న కరీంనగర్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల మంది తో నిర్వహించతలపెట్టిన రాష్ట్ర స్థాయి రైతు మహాగర్జన సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ పోరాటానికి మద్దతుగా మహాగర్జన సమర భేరి సభకు పెద్ద ఎత్తున రైతుల తో కలిసి తరలి వస్తామని ఆయా పార్టీల నాయకులు ప్రకటించడం పట్ల ప్రజా సంఘాల తరపున పోలాడి రామారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జడ్పీటీసీల ఫోరమ్ అధ్యక్షుడు, మానకొండూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తాళ్ళపల్లి శేఖర్ గౌడ్జి,జిల్లా రైతు ప్రజా సంఘాల నాయకులు శాత్రాజు యాదగిరి, రామంచ గోపాల్ రెడ్డి, దేవ సతీష్ రెడ్డి,పంజాల శ్రీనివాస్,మందల రాజేందర్ రెడ్డి,గోపు ఈశ్వర్ రెడ్డి,పిట్టల మధు,గంగుల రవి,బాకారపు రాములు, నెల్లి శంకర్ ముదిరాజ్, బూస తిరుపతి, సర్పంచులు ఎరుకల శ్రీనివాస్ గౌడ్, తాళ్ళపల్లి సంపత్, పారునంది కిషన్, మోటం సమ్మయ్య, అనిల్ కుమార్, బందారు శ్రీనివాస్ల తో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంటలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

▪ 196 మందికి వైద్య పరీక్షలు.. 19 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్య నిపుణుల ప్రకటన

**కరపత్రం ప్రతినిధి, ఇల్లందకుంట మే 15**

ఇల్లందకుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్, హుజూరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని సంతోషం, హర్షం వ్యక్తం చేశారు.

ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ధారా సురేష్ ప్రారంభించి అనంతరం స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.





శిబిరంలో మెడికవర్ హాస్పిటల్స్ కరీంనగర్, శ్రీనివాస విజన్ సెంటర్ హుజూరాబాద్, శరత్ మాక్స్ విజన్ హాస్పిటల్ హనుమకొండకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. మొత్తం 196 మందికి ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, కంటి మరియు ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి చుక్కల మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షల సమయంలో 19 మందికి కంట్లో పొరలు ఉన్నట్లు గుర్తించిన వైద్య నిపుణులు, వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రకటనతో బాధిత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి.

ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ట్రస్ట్ లక్ష్యమని తెలిపారు.

శిబిరంలో సేవలందించిన డాక్టర్లు, వైద్య సిబ్బందిని గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు, కారోబార్, గ్రామపంచాయతీ సిబ్బంది, హాస్పిటల్ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ ను సన్మానించిన ప్రొఫెసర్ పిట్టల రవిబాబు

– చేనేత కుటుంబాల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి–హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గూడూరు శ్రీనివాస్ ను హైదరాబాద్ సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో ప్రొఫెసర్ పిట్టల రవిబాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ పర్యావరణవేత్త, జేఎన్‌టీయూ మాజీ అసోసియేట్ ప్రొఫెసర్ పిట్టల రవిబాబు మాట్లాడుతూ.. విదేశీ, కృత్రిమ వస్త్రాల వినియోగం పెరగడంతో ప్రకృతి, పర్యావరణం, భారతీయ సంస్కృతి, సంప్రదాయ విలువలు దెబ్బతింటున్నాయని అన్నారు. దేశీయ చేనేత వస్త్రాల ఉత్పత్తి పెంపొందించేందుకు పద్మశాలి కార్పొరేషన్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. చేనేత శ్రామిక



కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సంప్రదాయ వృత్తులను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

అదేవిధంగా ప్రముఖ సామాజిక కార్యకర్త, రాచెరువు పరిరక్షణ సమితి సభ్యులు, బోడుప్పల్ పద్మశాలి సంఘం ముఖ్య సలహాదారు డా. లక్ష్మీవీరమల్లు నేత మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా చేనేత మగ్గాలు మూగబోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ మగ్గాల విస్తరణ, కార్పొరేట్ వ్యవస్థల ప్రభావంతో సంప్రదాయ చేనేత కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు.

కృత్రిమ వస్త్రాల వినియోగం పెరగడంతో చిన్నారుల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం ఉండొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాలకు సరైన ఆదరణ లేకపోవడం, తయారైన వస్త్రాలకు మార్కెట్ లేకపోవడం వల్ల సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నల్గొండ ప్రాంతాల్లో అనేక మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు బాధాకరమన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ చేనేత వృత్తిని పరిరక్షిస్తూ పద్మశాలి కుటుంబాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దీనికి స్పందించిన చైర్మన్ గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తో చర్చించి పద్మశాలి కుటుంబాల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# బొమ్మారం ఐకెపి వరి ధాన్యం కేంద్రం కు లారీలు రాక ఎక్కడి దాన్యం అక్కడే ఉన్నదని తెలిపిన ఏపీఎం సుభాష్ గౌడ్ వి ఓ ఏ సి హెచ్ నాగమణి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట మే 15**


మెదక్ జిల్లా మాసాయిపేట మండలం బొమ్మరం గ్రామంలో ఐకెపి కేంద్రానికి లారీలు రాక ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయిందని శుక్రవారం నాడు ఏపిఎం సుభాష్ గౌడ్ వి ఓఏ సిహెచ్ నాగమణిలో తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ తేదీ శుక్రవారం వరకు మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ గ్రామంలో ఉన్న సాయి గీత రైస్ మిల్ కు 18 94 సంచులను గాను 757 క్వింటాళ్ల 67 కిలోలు మూడు లారీల ద్వారా ఒక ట్రాక్టర్ తో మూడు రోజుల క్రితం 17 మంది రైతులు మూడు రోజులలో రెండు లారీలు ఖాళీ అయ్యాయని వరి ధాన్యాన్ని ప్రభుత్వం తెలిపిన



విధంగానే వరి దాన రేటును వారి బ్యాంకు ఖాతాలో 2389 రూపాయలను వేయడం జరిగిందని ప్రస్తుతం వరి ధాన్యం కేంద్రంలో 2000 సంచులు ఉన్నాయని లారీ రాకపోవడంతో వరి ధాన్యం కేంద్రంలోని ఉంచడం జరిగిందని వారు తెలిపారు రైతులను అర్థం చేసుకొని ప్రభుత్వ నాయకులు లారీలను త్వరగా పంపిస్తే రైతులు నష్టపోయే పరిస్థితులు ఉండవని ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించి బొమ్మరం వరి ధాన్యం కేంద్రానికి లారీలను పంపించాలని వారు తెలియజేశారు

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- జమ్మికుంట 11వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో విస్తృత స్థాయిలో గ్యాంగ్ వర్క్ నిర్వహించిన కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్
- పారిశుధ్యం, డ్రైనేజీ శుభ్రత, చెత్త తొలగింపు, రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు
- ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు నిరంతర పర్యవేక్షణ





**జమ్మికుంట, మే 15 కరపత్రం ప్రతినిధి**

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డును పరిశుభ్రంగా, సమస్యల రహితంగా తీర్చిదిద్దేందుకు 11వ వార్డు కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి వార్డు పరిధిలో విస్తృత స్థాయిలో గ్యాంగ్ వర్క్ నిర్వహించి పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. వార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, డ్రైనేజీలను శుభ్రపరచడం, రోడ్ల పక్కన ఉన్న మురుగు నిల్వలను తొలగించడం, కాలనీల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం వంటి పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ పొనగంటి విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో డ్రైనేజీల్లో మురుగు పేరుకుపోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పారిశుధ్య సమస్యల వల్ల వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు మున్సిపల్ సిబ్బందితో సమన్వయంగా ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.

వార్డులోని ప్రతి కాలనీ, ప్రతి వీధిని పరిశీలిస్తూ ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్యలు, చెత్త పేరుకుపోవడం, రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండటం వంటి సమస్యలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం తమ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు.

మున్సిపల్ సిబ్బంది ఉదయం నుంచే ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వార్డులోని పలు ప్రాంతాల్లో శుభ్రత పనులు నిర్వహించారు. కాలనీల్లో చెత్త సేకరణ, డ్రైనేజీ కాలువల శుభ్రపరిచే పనులు, రోడ్లపై పేరుకుపోయిన మట్టి తొలగింపు, మురుగు నీటి ప్రవాహాన్ని సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టారు. కొన్నిచోట్ల ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యలను స్థానికులతో మాట్లాడి తెలుసుకుని తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ వార్డులో గత కొంతకాలంగా ఉన్న పారిశుధ్య సమస్యలపై కౌన్సిలర్ ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి స్వయంగా పర్యవేక్షిస్తూ పనులు చేయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా కౌన్సిలర్ పనిచేస్తున్నారని కొనియాడారు.

అదేవిధంగా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కౌన్సిలర్ విజ్ఞప్తి చేశారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించాలని కోరారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, అందువల్ల ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

వార్డులో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతాయని, ప్రజల సహకారంతో 11వ వార్డును ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పొనగంటి విష్ణువర్ధన్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, వార్డు నాయకులు, స్థానిక యువకులు, మహిళలు, కాలనీ ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ ఆర్ లో గ్రంథాలయ జ్ఞానోత్సవం

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మే 15**

శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో ఐదవ రోజున జరగాల్సిన కార్యక్రమాల్లో భాగంగా మన గ్రంథాలయ జ్ఞానోత్సవం అనే కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కలువకుంట రామకృష్ణ ఆధ్వర్యంలో కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ గట్ల కృష్ణారెడ్డి నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొదటగా పుస్తక ప్రదర్శన ఈ రిసోర్సెస్ పై బ్రోచర్, లైబ్రరీ బ్రోచర్ ఆవిష్కరించడం జరిగింది. గ్రంథాలయాన్ని తరచుగా సందర్శించే విద్యార్థులకు అభినందన పూర్వకంగా



బహుమానాలు అందజేయడం జరిగింది. అనంతరం పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులకు సన్మానం చేయడం జరిగింది .రకరకాల పత్రికల్లో పనిచేసే పాత్రికేయులకు గ్రంథాలయ ప్రాముఖ్యత లైబ్రేరియన్ వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థిని విద్యార్థులకు అధ్యాపకులందరికీ గ్రంథాలయంలో ఉన్నటువంటి డిజిటల్ లైబ్రరీ యొక్క సేవల వివరాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ నితిన్ పాఠక్ ,టిరాజయ్య ఐక్యూఏసి



కో ఆర్డినేటర్ డాక్టర్ హర్జోత్ కౌర్ ,స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ మల్లారం శ్రీనివాస్ రెడ్డి వివిధ విభాగాల అధిపతులు జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్లు అర్జున్ పడాల తిరుపతి రాజేందర్ వెంకటేశ్వర్లు తదితర అధ్యాపకులు బోధనేతర సిబ్బంది , పాత్రికేయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.80 లక్షలతో వైకుంఠ ధామం కాంపౌండ్ వాల్ నిర్మాణం



- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో గల ఎల్లమ్మ గుడి ప్రాంతంలో ఉన్న వైకుంఠ ధామానికి రూ.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న కాంపౌండ్ వాల్ పనుల స్థలాన్ని శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో పట్టణ అభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీటి వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పనులను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక కౌన్సిలర్లు తోటరాజు, కొండ రాజశేఖర్, మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ సంపత్ రెడ్డి, ఏఈ అనన్య మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## జమ్మికుంట నూతన కమిషనర్ మల్లికార్జున స్వామి

- మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ నాయకుల ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకని రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శీలం శ్రీనివాస్, గుర్రం పరశురాం, తూర్పాటి శంకర్, ఉడుగుల మహేందర్ తదితరులు పాల్గొని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ అభివృద్ధికి నూతన కమిషనర్ సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు, వీధిదీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రజా ప్రతినిధులతో సమన్వయం కలిగి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సూచించారు.

నూతన కమిషనర్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన మున్సిపల్ సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో జమ్మికుంటను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా కొనసాగుతున్న జనగణన



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మే 15**

జనగణన 2027 ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లోని వివిధ డివిజన్లలో జనగణన పర్యవేక్షకుల మార్గదర్శనంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ఇండ్ల గణనకు సంబంధించిన సర్వేను ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు పర్యవేక్షకుల మార్గదర్శనంలో ఇండ్ల గణనను సజావుగా చేపట్టాలని, ఏ ఒక్క ఇంటిని వదిలిపెట్టకూడదని, ప్రజలు తమ ఇంటి వివరాలను తెలియజేస్తూ ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ జనగణన బాధ్యులు తిరుపతి మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు ఇండ్ల గణన సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా సమాచారాన్ని నమోదు చేయాలని కోరారు. కరీంనగర్ లోని లోని 64వ డివిజన్లో పర్యవేక్షకులు డాక్టర్ ఎం. మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లు శిల్పారాణి, అరుణ ,సౌజన్య ,కిరణ్ ,కిరణ్మయి, ప్రవీణ్ కుమార్ ,రమేష్ రెడ్డిలు జనగణన సర్వేను కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు వేణు, తేజస్విని, శ్రీధర్ సంధ్యలు , రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని పొదుపు సూత్రంలో సుప్రీం

పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఇంధనం వాడకాన్ని తగ్గించుకోవాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టు కూడా పొదుపు చర్యలు చేపట్టింది. వారానికి రెండు రోజులు సోమ, శుక్రవారం పూర్తి స్థాయిలో వర్చువల్ విధానంలో విచారణ జరపాలని నిర్ణయించింది. అంతేకాదు, మంగళవారం నుంచి గురువారం వరకు హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడతామని, కక్షిదారులు వీలును బట్టి ఎలాగైనా పాల్గొనవచ్చని పేర్కొంది. ఈ మేరకు సుప్రీం కోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేసింది. కొత్త ఏర్పాట్ల ప్రకారం.. ఇంధనం పొదుపులో భాగంగా న్యాయమూర్తులు కూడా కార్ పూలింగ్ ను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది. రోజువారీ కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూసుకోవడంతో పాటు ప్రతి రిజిస్ట్రీ లేదా సెక్షన్‌లోని 50 శాతం సిబ్బందికి వారానికి గరిష్ఠంగా రెండు రోజులు వర్క్-ఫ్రం-హోమ్‌కు అనుమతించాలని సూచించింది.

# మక్కల కొనుగోళ్లు వేగవంతం చేయాలి

## రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- కొనుగోలు చేసిన మక్కలను వెంటనే గోదాంలకు తరలించాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా
- జమ్మికుంట మార్కెట్ యార్డులో మక్కల కొనుగోలు కేంద్రం పరిశీలన

**కరపత్రం ప్రతినిధి, జమ్మికుంట**

మక్కల కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన మక్కల బస్తాలను ఆలస్యం చేయకుండా వెంట వెంటనే గోదాంలకు తరలించి భద్రపరచాలని సూచించారు.

శుక్రవారం జమ్మికుంట మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు తేమ శాతం పరీక్షలు, తూకం, చెల్లింపులు, గన్ని బ్యాగుల లభ్యత తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని ఆరా తీశారు.

అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రోజుకు ఎన్ని క్వింటాళ్ల మక్కలు కొనుగోలు చేస్తున్నారని, కొనుగోలు ప్రక్రియ ఎంత వేగంగా కొనసాగుతోందని, గన్ని బ్యాగుల కొరత ఉందా, రవాణా ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు





రోజుల తరబడి యార్డుల్లో వేచి ఉండే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నందున అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం, జాప్యం అస్సలు సహించబోమని హెచ్చరించారు. కొనుగోలు చేసిన మక్కల బస్తాలను వెంటనే లిఫ్టింగ్ చేసి గోదాంలకు తరలించాలని, నిల్వ సమయంలో తేమ, వర్షం, పురుగుల సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు



తీసుకోవాలని ఆదేశించారు.

తదుపరి మార్కెట్ యార్డు సమీపంలోని గోదాంను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ నిల్వ ఉంచిన మక్కల బస్తాల అమరిక, భద్రతా చర్యలు, స్టాక్ నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి బస్తాను సురక్షితంగా నిల్వ ఉంచాలని, ఎప్పటికప్పుడు లిఫ్టింగ్ నిర్వహించి గోదాంలలో స్థలం సమస్య తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు.రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న, హుజురాబాద్ ఆర్డీవో కే రమేష్ బాబు, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ మహమ్మద్ షహబుద్దీన్, తహసీల్దార్ వెంకటరెడ్డి, మార్కెట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.